క్లుప్తంగా

మునగ సాగు లాభదాయకం

దమ్మపేట: మునగ పంట సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని, అశ్వారావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నల్లకుంట శివారులో తాళ్ల శంకర్రావు అనే రైతు నూతనంగా సాగు చేస్తున్న మునగ క్షేత్రాన్ని, ఏడీఏ, వ్యవసాయ శాఖ సిబ్బందితో కలసి సందర్శించారు. లేత దశలో ఉన్న మునగ మొక్కలను పరిశీలించి, సాగులో పాటించవలసిన మెళకువలను రైతుకు సూచించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. మునగ సాగును ప్రోత్సాహించడానికి ప్రభుత్వం అనేక రాయితీలను అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖర రెడ్డి, ఏఈఓలు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ కార్డు తప్పనిసరి

చర్ల: ప్రతీ విద్యార్థికి అపార్ కార్డు తప్పని సరి అని, ఈ కార్డుపై విద్యార్థుల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాదికారి పరిటాల వెంకట రమణ పేర్కొన్నారు. అపార్ కార్డుపై అవగాహన కలిగించేందుకు మంగళవారం చర్లలోని గురుదేవ్ విద్యాలయంలో తల్లిదండ్రులతో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం అపార్ కార్డును తప్పని సరి చేసిన నేపథ్యంలో కార్డును పొందేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అపార్ స్టాంగ్ పర్సన్ యాదగిరి మాట్లాడుతూ.. కార్డులో వివరాలు నమోదు చేసుకునే టప్పుడు ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సదస్సులో గురుదేవ్ విద్యాలయం ప్రిన్సిపాల్ హెచ్‌జీవీ గిరిప్రసాద్, విద్యాలయం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెండి గరగ వితరణ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి 2 కేజీల బరువుగల వెండి గరగను భక్తులు వితరణగా మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డికి అందచేశారు. కర్రెళ్ల సుందర రామకృష్ణారావు, కర్రెళ్ల రాజరాజేశ్వరి జ్ఞాపకార్థం వారి కుమార్తెలు నట్ల సుమతి, నాయుడు హేమ, మోటుపల్లి నీలిమ, కర్రెళ్ల పూర్ణిమ, మోటుపల్లి భాను శ్వేతలు కలిసి సుమారు రూ.2లక్షల విలువ గల రెండు కేజీల బరువు ఉన్న గరగను ఆలయ కమిటీకి అందజేశారు.

చదువుపై దృష్టి పెట్టాలి

బూర్గంపాడు: విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు సునిశిత దృష్టి పెట్టాలని బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చీన్యా అన్నారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు రెగ్యులర్‌గా కళాశాలకు వెళ్లే విషయంపై ఆరా తీస్తుండాలని, సెల్‌ఫోన్ ఎక్కువగా వాడకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటర్మీయట్ జీవితానికి టర్నింగ్ పాయింట్ అని, ఇంటర్ పూర్తి చేసుకుంటే జీవితంలో స్థిరపడేందుకు మొదటి మెట్టు ఎక్కినట్లేనని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ముకుందం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మణుగూరురూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీ సాంబాయిగూడెం గ్రామంలో సుమారు 30 కుటుంబాల వారు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గులాబి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యకర్తలందరికీ అండగా బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, కో కన్వీనర్లు బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

చర్ల: రాష్ట్రంలో ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతీ నిరుపేద కుటుంబానికి రూ12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చి తహసీల్ ఎదుట నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి దాసరి సాయిబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాలెం చుక్కయ్య, పార్టీ జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెసా గ్రామసభ

ములకలపల్లి: గిరిజనులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జీ.రేవతి సూచించారు. స్థానిక జీపీ కార్యాయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పెసా గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుని, ఉన్నతిస్థితికి చేరుకోవాలని పిలుపునిచ్చారు, జీపీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుల్లో ఆందోళన

- అల్పపీడన నేపథ్యంలో చిరుజల్లులు
- కల్లాల్లోనే ఉండిపోయిన పంట
- కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం రాశులు



అశ్వాపురం: మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం



చంద్రుగొండ: ధాన్యం రాశులపై పరదాలు కప్పుకున్న రైతులు

అశ్వారావుపేటరూరల్: అల్పపీడనం నేపథ్యంలో వాతావరణం చల్లబడటంతోపాటు చిరు జల్లులు కురిశాయి. ఈ అకాల వర్షంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కురిసింది. దీంతో వరి, వేరుశెనగ రైతులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. మండలంలో ముమ్మరంగా వరి కోతలు, వేరుశెనగ తీతల పనులు సాగుతున్నాయి. వరి కోతలు పూర్తైన రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి అరబోస్తుండగా, వర్షం చినుకలతో కుప్పలపై పరదాలు కప్పారు. అలాగే వేరుశెనగ పంట పొలాల్లోనే ఉండటంతో వర్షంలో తడవకుండా కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షం కురిస్తే కోతలు పూర్తయిన పనలుగా పంట వరదపాలు అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చంద్రుగొండ: మండలంలో తుఫాన్ ప్రభావంతో మంగళవారం వర్షం పడింది. దీంతో గోదాముల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాసులను కాపాడుకునేందుకు రైతులు హైరానా పడ్డారు. పరదాల కోసం పరుగులు తీశారు. వరుసగా ఏర్పడుతున్న తుఫాన్‌ల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతుల పాలిట శాపంగా పరిణమించాయి. గన్ని సంచుల కొరతతో నాలుగు రోజులుగా కాటాలు ఆగిపోయాయి. గన్ని సంచులు రావడంతో కాటాలు ప్రారంభించిన నేపథ్యంలో వర్షం రావడంతో కాటాలు నిలిచిపోయాయి. దీంతో రైతుల్లో నిరాశ నెలకొంది. మరో రెండు రోజులపాటు వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

అశ్వాపురం: అల్పపీడనం తుఫాన్ ప్రభావంతో అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధాన సాగునీటి వనరైన తుమ్మలచెరువు ఆయకట్టు కింద మొండికుంట, మల్లెలమడుగు, బీజీ కొత్తూరు, నెల్లిపాక ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పెద్ద ఎత్తున ధాన్యం ఆరబోశారు. వాతావరణ మేఘావృతమై వర్షం కురుస్తుండటంతో ఆరబోసిన ధాన్యం కాపాడుకనేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికొచ్చే సమయంతో వర్షంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని కోరుతున్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

అశ్వారావుపేటరూరల్: క్రిస్మస్ పండుగ వేడుకలకు ప్రార్థనా మందిరాలు, చర్చిలు సుందరంగా ముస్తాబయ్యాయి. పండుగ వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. అశ్వారావుపేటలోని పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్‌లోని సీఎస్ఐ చర్చి, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ బజార్‌లోని సియేను ప్రార్థన మందిరం, డ్రైవర్స్ కాలనీలోగల హోసన్న మందిరం, అటెండర్స్ కాలనీలోని గుడ్ న్యూస్ స్మాల్ చర్చితోపాటు పాత అల్లిగూడెం, ఊట్లపల్లి, పేరాయిగూడెం, నారంవారిగూడెం, అచ్యుతాపురం, జమ్మిగూడెం, వినాయకపురం, వినాయకపురం కాలనీ, ఆసుపాక, ఆసుపాక కాలనీ, నందిపాడు, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, నారాయణపురం, అనంతారం, గాండ్లగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం, మల్లాయిగూడెంతోపాటు పలు గ్రామాల్లోని ప్రార్థన మందిరాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చిల వద్ద స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేయడంతో ఆకట్టుకుంటున్నాయి.



విద్యుత్ దీపాలతో ముస్తాబైన సీఎస్ఐ చర్చి

ప్రజాస్వామ్య స్ఫూర్తితో పాలన

కరకగూడెం: రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన 102 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. సరదాగా వాహనం నడిపారు. ఆస్పత్రికి రెండు వైపులా ప్రహరీ నిర్మాణానికి అవసరమైన అంచనాలను రూపొందించి తనకు ఇవ్వలని పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లును ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం తాటిగూడెం గ్రామంలో సుమారు 20లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామస్తుల సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ స్థల దాతలు కొమరం వెంకటమ్మ, సత్యవతి, విజయలను శాలువాలతో సత్కరించారు. మండలానికి చెందిన సుమారు 20 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.6.50లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ దినేష్, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ నాగప్రసాద్, ఎంఈఓ మంజుల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు ఎర్ర సురేష్, పోలెబోయిన తిరుపతయ్య, శ్రీవాణి, జలగం కృష్ణ, గొగ్గలి రవి, మధు పలు శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కరకగూడెం: తాటిగూడెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాయం

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

భద్రాచలంఅర్బన్: గుర్తుతెలియని కొందరు వ్యక్తులు ఇద్దరిని కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన మంగళవారం భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా మంగళవారం రాత్రి వీరబాబు, వెంకన్న అనే ఇద్దరు తమ పనుల్లో తామున్నారు. ఇంతలో గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి చేరుకుని వారిద్దరిని కత్తులతో దాడి చేసి వెళ్లిపోయారు. విషయాన్ని స్థానికులు పోలీసులను సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ దాడిలో వెంకన్న వీపు మీద, వీరబాబు పొట్టమీద కత్తిపోట్ల పడినట్లు ఏరియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. కాగా దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గంజాయి పట్టివేత

భద్రాచలంఅర్బన్: కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టణంలోని కూనవరంరోడ్డు ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. హైదరాబాద్‌కు చెందిన ఎండీ నదీమ్, షహీన్ అక్తర్.. గంజాయిని సీలేరులో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పట్టుబడ్డారని, గంజాయి విలువ రూ.36 వేలు ఉంటుందని పట్టణ పోలీసులు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి

భద్రాచలంటౌన్: ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో ఇరు రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు మంగళవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్ ఆధ్వర్యంలో ఎటపాక మండలంలోని గుండువారిగూడెం, పిచ్చుకులపాడు గ్రామాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. 180 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 18,500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దాడుల్లో ఏపీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధు, కరంచంద్, నాగరావూర్, రహీమున్నీసాబేగం, రమేశ్, శ్రీనివాస్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలపరిధిలోని రాజుపేట శివారు పాములేరు వాగు బ్రిడ్జి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జగన్నాథపురం నుంచి ములకలపల్లికి వస్తున్న గుర్తు తెలియని యువకుడి బైక్, వంతెన సమీపంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆలయంలో నీటి సదుపాయం ఏర్పాటు

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో రేగుబల్లి గ్రామానికి చెందిన తోటమళ్ళ సంగీతరావు, వెంకట లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని వారి దాహార్తి తీర్చేందుకు ముందుకు వచ్చిన సంగీతరావు దంపతులు అందుకు సంబంధించి కొంత నిధులను అందించి మంచినీటి ట్యాంకుతో పాటు ట్యాప్‌లను ఏర్పాటు చేసి వాటిని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, కార్యదర్శి బైరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంకు, పంపులను ప్రారంభిస్తున్న దాతలు

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



దమ్మపేట: ముష్టిబండలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

దమ్మపేట: రాజ్యసభలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ.. ఆయన దిష్టిబొమ్మను సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని ముష్టిబండ రాష్ట్రీయ రహదారిపై మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంను రూపొందిచడంలో ప్రముఖ పాత్ర పోషించిన అంబేడ్కర్‌ను నిండు రాజ్యసభలో అవమానకరించేలా అమిత్ షా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమిత్ షాను పార్లమెంటు నుంచి బహిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, కోలికపోగు శ్రీనివాసరావు, జగపతిరావు, అశోక్, ప్రశాంత్, అనిల్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవని సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరశిస్తూ సీపీఎం ఆధ్యర్యంలో మంగళవారం చర్లలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించి అమిత్‌షాకు, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మచ్చా రామారావు మాట్లాడుతూ.. దురహంకారంతో వ్యవహరించే పార్టీలు, నాయకులు సమాజంలో నిలబడలేరని ఆయన అన్నారు. తక్షణమే అమిత్‌షాను ప్రభుత్వం నుంచి భర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం నరేష్, పొడుపుగంటి సమ్మక్క, బాలాజీ, షారోన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గుండాల: గత పది రోజుల నుంచి సమ్మె చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతుగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి కేజీబీవీ విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే ఉపాధ్యాయుల, సిబ్బంది సమస్యలు పరిష్కారం చేసి రెగ్యులర్‌గా పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆరబోసిన ధాన్యం పరిశీలన

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని మంగళవారం మణుగూరు ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు సందర్శించి వడ్లలోని తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తేమశాతం లేకుండా ఆరబెట్టుకోవాలని సూచించారు.

సన్నబియ్యానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.500ల బోనస్ పొందాలంటే తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే



చంద్రుగొండ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: స్థానిక రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలు సదా అనుచరణీయమన్నారు. క్రైస్తవ సంఘాలకు రూ.36 వేల చెక్కును అందజేశారు. కేక్ కట్ చేశారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భారతి, ఏఓ అరుణ్‌బాబు, ఏపీఓ సంపత్‌కుమార్, సంఘ మండల అధ్యక్షుడు జాన్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి, నాగళ్ల వెంటేశ్వరరావు, అనుమల సత్యనారాయణ, శనగపాటి రవి, గుంపుల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే జారే.. రైతువేదికల్లో జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండుగ సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.36 వేలను చర్చి పాస్టర్లకు ఆయన అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, నాయకులు భోజ్యా నాయక్, కీసరి కిరణ్‌రెడ్డి, ఉప్పతల ఏడుకొండలు, సారేపల్లి శేఖర్, టి.సురేష్, దారం గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీని అందజేత..

దమ్మపేట: వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారి, శస్త్ర చికిత్సకు అవసరమైన ఎల్‌ఓసీ పత్రాన్ని మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆ చిన్నారి తల్లిదండ్రులకు మంగళవారం అందజేశారు. మండల కేంద్రం, దమ్మపేట గ్రామ పరిధిలోని బంజారా కాలనీకు చెందిన భూక్యా ఏసు కుమార్తె కావ్య(2), పుట్టుకతో వినికిడి సమస్యతో బాధపడుతోంది. దీనికి అవసరమైన శస్త్ర చికిత్సకు రూ.7లక్షల 50 వేలు అవసరం కాగా విషయాన్ని ఎమ్మెల్యే జారే దృష్టికి తీసుకెళ్లి, ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.రూ.7లక్షల 50 వేల విలువైన ఎల్‌ఓసీను మంజూరు చేయించి, బాధిత చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, పలు సమస్యలపై ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలవగా, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లైన్‌లో సూచించారు.

సమ్మె నోటీస్ అందజేత

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆయా అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో టోకెన్ సమ్మె చేపట్టనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాల పెంపు, మల్టీ పర్పస్ విధానం రద్దు తదితర డిమాండ్ల సాధనకు సమ్మెకు పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు. సమ్మెకు ప్రభుత్వం స్పందించాలని, లేదంటే జనవరి 5వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: ఈఓ శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



బూర్గంపాడు: పంచాయతీ కార్యదర్శికి నోటీస్ ఇస్తున్న పంచాయతీ కార్మికులు



చర్ల: ఎంపీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీని విడదీయకండి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీని విడదీయకుండా ఉండాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రజలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పర్ణశాల పంచాయతీని రెండుగా విడదీయడానికి మండల అధికారులు జిల్లా అధికారులకు ప్రణాళికలు పంపించారనే విషయం గత రెండు రోజులుగా ప్రచారం సాగుతోందని అన్నారు. పర్ణశాల పంచాయతీ ఉమ్మడిగా కొనసాగించడం వల్ల ఆదివాసీ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, పర్ణశాల పంచాయతీలో వచ్చే ఆదాయంతో గ్రామాల అభివృద్ధికి సహకారం అందుతుందని అన్నారు. కాబట్టి పర్ణశాల పంచాయతీని విడదీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రజలు తెల్లం హరికృష్ణ, తెల్లం భీమరాజు, చింతం రమేష్, సోయం వీరాజు, లక్ష్మీనర్సు, నరసింహారావు, కనకరావు, వెంకటేశ్వరావు, యుగేందర్ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ ప్రజలు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

భద్రాచలంఅర్బన్: చేతికందే ఎత్తులో ఓ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో కరకట్ట వద్ద కమ్మ సేవా సమితి సమీపంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉంది. ఈ ప్రాంతం మీదగా నిత్యం అనేక మంది భక్తులు వెళ్తుంటారు. గతంలో ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కొంత ఎత్తులో ఉండేది. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రెయినేజీని నిర్మించారు. ఆ క్రమంలో మట్టిని తొలడంతో సదరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందే స్థాయికి చేరుకుంది. ఈ ప్రాంతం మీదగా నిత్యం చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా తిరుగుతుంటారు. జంతువుల రాకపోకలు సాధారణం. ఆదమరిచి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి ఎవరైనా చిన్నారులు, వృద్ధులు, మూగ జంతువులు వెళ్తే పెద్ద ప్రమాదమే ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేసి స్థానికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుకుంటున్నారు.